ప్రజాశక్తి
శనివారం 26 నవంబర్ 2022 5



పార్వతీపురంలో వైద్య కళాశాలకు అనుమతులు

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

జిల్లా కేంద్రంలో ప్రభుత్వ కొత్త వైద్య కళాశాల ఏర్పాటుకు రూ.600 కోట్లు నిధులు విడుదల చేస్తూ బుధవారం పరిపాలనా అనుమతులు జారీ చేసిందని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిధులతో వైద్య కళాశాల, బోధనాసుపత్రి, క్వార్టర్స్, అనుబంధ భవనాలు, నర్సింగ్ కాలేజీ, హాస్టల్ నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ముఖ్యమంత్రి జిల్లా ప్రజలకు గతంలో ఇచ్చిన మాట ప్రకారం నూతన జిల్లాను ఏర్పాటు చేయడమే కాకుండా ఈ ప్రాంత ప్రజల ప్రజా ఆరోగ్య పరిరక్షణకు ప్రాంతీయ ఆసుపత్రిని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా అధునీకరిస్తూ ఇటీవల కాలంలో సుమారు రూ.50 కోట్లు నిధులు విడుదల చేయడమే కాకుండా ఈ జిల్లా ప్రజల చిరకాల కోర్కెకైన వైద్య కళాశాల ఏర్పాటుకు పరిపాలనా అనుమతులు కూడా మంజూరు చేస్తూ జీవో జారీ చేశారని ఆ ప్రకటనలో తెలిపారు.

సంక్షేమ వసతిగృహాలకు కష్టాలే

- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- అధికారుల పర్యవేక్షణ కరువు

ప్రజాశక్తి-పాలకొండ/పాలకొండ రూరల్

పేద విద్యార్థులు తలదాచుకుంటున్న సంక్షేమ వసతి గృహాల్లో కష్టాలు తప్పడం లేదు. పట్టించుకోవాల్సిన పాలకులు, అధికారుల నిర్లక్ష్యం వల్ల సమస్యల నడుమ విద్యార్థులు చదువులు సాగిస్తున్నారు. కనీస వసతులు కూడా కల్పించకపోవడంతో విద్యార్థులు పడుతున్న అవస్థలు వర్ణణాతీతం.

పట్టణంలో సాంఘిక సంక్షేమం పరిధిలో 4 వసతి గృహాలు, బిసి సంక్షేమశాఖ పరిధిలో 2 వసతి గృహాలున్నాయి. అయితే సాంఘిక సంక్షేమ పరిధిలో నడుస్తున్న నాలుగు వసతిగృహాల్లో సుమారు 150 మంది వరకు విద్యార్థులు ఉండగా, బిసి సంక్షేమ వసతిగృహాల్లో 74 మంది విద్యార్థులే ఉన్నారు. ఈ వసతిగృహాల్లో ఉంటున్న విద్యార్థులకు మౌలిక సదుపాయాలు అరకొరగానే ఉన్నాయి. ప్రధానంగా గారమ్మకాలనీ దగ్గర ఉన్న బిసి ప్రీమెట్రిక్, పోస్టుమెట్రిక్ వసతిగృహంతో పాటు సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతిగృహంలో సమస్యలు కొలువుతీరుతున్నాయి. లక్షలు ఖర్చుపెట్టి ఎన్నో ఏళ్ల కిందట భవనాలు నిర్మించినప్పటికీ తాగునీటి సమస్య పరిష్కరించలేదు. దీంతో నగర పంచాయతీ అధికారులు ట్యాంకుల ద్వారా నీరిస్తే తప్ప వేరే గత్యంతరం లేని పరిస్థితి. విద్యార్థులకు తాగునీటి కోసం రోజూ 20 లీటర్ల మినరల్ వాటర్ బాటిళ్లు కొనుగోలు చేసే పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా వినియోగానికి నీరు ఉండకపోవడంతో మరుగుదొడ్లు కూడా అలంకార ప్రాయంగానే ఉన్నాయి. దీంతో విద్యార్థులు ఆరుబయటకే మలమూత్ర విసర్జనకు వెళ్లాల్సిన పరిస్థితి ఎదురవుతుంది.

పర్యవేక్షణ కరువు....

వసతిగృహాల్లో అధికారుల పర్యవేక్షణ కరువుగా ఉందని చెప్పవచ్చు. ఇన్‌ఛార్జీలు కావడంతో పూర్తిస్థాయిలో వసతిగృహాల్లో ఉండకపోవడంతో విద్యార్థులపై శ్రద్ధ తీసుకొనే నాథుడే కరువయ్యారు. బిసి ప్రీ, పోస్టుమెట్రిక్ వసతిగృహాలకు సీతంపేటకు చెందిన వార్డెన్ ఇన్‌ఛార్జిగా ఉండడంతో ఇక్కడ పూర్తిస్థాయిలో సమయం కేటాయించలేకపోతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అదే విధంగా సాంఘిక సంక్షేమశాఖ పరిధిలో నడుస్తున్న రెండు వసతిగృహాలకు ఒకే వార్డెన్ కావడంతో ఆయన కూడా పనిభారంతో ఇబ్బందులు పడే పరిస్థితి కనిపిస్తుంది. అదే విధంగా సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతిగృహాలు రెండు ఉండగా సమీకృత వసతిగృహాధికారి దీర్ఘకాలిక సెలవుపై వెళ్లిపోవడంతో మరో బాలిక వసతిగృహానికి చెందిన అధికారికే అదనపు బాధ్యతలు అప్పగించారు. వసతిగృహాల నిర్వహణపై పూర్తిస్థాయిలో దృష్టిపెట్టాల్సిన సాంఘిక సంక్షేమశాఖ డివిజన్ సహాయాధికారి శ్రీకాంత్ కొద్దిరోజులుగా సెలవుపై వెళ్లిపోవడంతో పార్వతీపురం ఎఎస్‌డబ్ల్యుఒకు అదనపు బాధ్యతలు అప్పగించడంతో ఆయన కూడా పూర్తిగా అందుబాటులో ఉండడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. బిసి సంక్షేమశాఖ సహాయాధికారి కృష్ణ జిల్లా బిసి సంక్షేమశాఖ అధికారిగా అదనపు బాధ్యతలు నిర్వహించడంతో ఆయన కూడా అందుబాటులో ఉండడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఏదిఏమైనా విద్యార్థుల సమస్యలు పరిష్కరించాల్సిన నాథుడే కనిపించడం లేదు.



బిసి హాస్టల్ విద్యార్థుల కోసం కొనుగోలుచేసిన మినరల్ వాటర్ క్యాన్లు

ఆరోగ్యకర ఓటరు జాబితా తయారు కావాలి

పోలింగ్ కేంద్రాలను సిఇఒ తనిఖీ

ప్రజాశక్తి - కలెక్టరేట్

ఆరోగ్యకర ఓటరు జాబితా తయారు కావాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సిఇఒ) ముఖేష్ కుమార్ మీనా అన్నారు. శుక్రవారం జిల్లా పర్యటనకు విచ్చేసిన ఆయన ఓటరు నమోదు అధికారులు, సహాయ ఓటరు నమోదు అధికారులతో స్థానిక కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సమీక్షించారు. అనంతరం సిఇఒ మాట్లాడుతూ ఓటరు జాబితా పక్కాగా ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రాల వారీగా మృతి చెందిన, వలసలు వెళ్లిన, రెండు సార్లు నమోదైన ఓటర్ల వివరాలు పరిశీలించాలని ఆయన ఆదేశించారు. ప్రిమిటివ్ వల్నరబుల్ ట్రైబల్ గ్రూప్ (పివిటిజి) ఓటర్ల నమోదుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. లింగ వైవిధ్యం (హిజ్రా) గల వారు, దివ్యాంగులు, నిరాశ్రయులు తదితర విభాగాల్లో 18ఏళ్లుదాటిన అభ్యర్థులను ఓటర్లుగా గుర్తించి, నమోదు చేయాలని సూచించారు. జిల్లాలో జరుగుతున్న ఓటరు నమోదు కార్యక్రమంపై సిఇఒ సంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం సూచనల మేరకు ఓటరు నమోదు కార్యక్రమం జిల్లాలో చేపట్టడం జరుగుతుందన్నారు. జిల్లాలో మృతి చెందిన, వలసలు వెళ్లిన, రెండు సార్లు నమోదైన ఓటర్ల వివరాలపై క్షేత్ర స్థాయిలో తనిఖీలు నిర్వహించి చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో 3,76,072 మంది పురుష, 3,97,619 మంది మహిళా ఓటర్లు ఉన్నారని చెప్పారు. జిల్లాలో 1,024 పోలింగ్ కేంద్రాలు 708 ప్రదేశాల్లో ఉన్నాయని చెప్పారు. పోలింగ్ కేంద్రాల్లో 928 గ్రామీణ, 96 పట్టణ కేంద్రాలు ఉన్నాయని వివరించారు. శాసన మండలి పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమంపై మాట్లాడుతూ జిల్లాలో 17,052 మంది పట్టభద్రులు ఓటర్లుగా నమోదయ్యా రని తెలిపారు. 24 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. అనంతరం స్థాని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గల పోలింగ్ కేంద్రాన్ని సిఇఒ తనిఖీ చేసి బూత్ స్థాయి అధికారులు చేపడుతున్న కార్యకలా పాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్వీప్ కార్యక్రమంలో భాగంగా సంతకాల బోర్డుపై ప్రధాన ఎన్నికల అధికారి సంతకం చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్, ఐటిడి ప్రాజెక్టు అధికారులు డాక్టర్ బి.నవ్య, సి.విష్ణుచరణ్, డిఆర్ఒ జె.వెంకటరావు, సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, ఆర్‌డిఒ కె.హేమలత, తహశీల్దార్లు, ఎన్నికల డిటిలు పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని లచ్చయ్యపేట పోలింగ్ కేంద్రాన్ని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఎంకె మీనా పరిశీలించారు. ఓటరు జాబితాలో మరణించిన, వలసలు వెళ్లే వారిని తొలగించాలన్నారు. పోలింగ్ కేంద్రా లపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయనతో పాటు కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఆర్‌డిఒ హేమలత, తహశీల్దార్ ఎంవి రమణ, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ఎంకె మీనా, కలెక్టర్, జెసి

విద్యార్థుల పురోభివృద్ధిపై దృష్టి : డిఇఒ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

విద్యార్థుల పురోభివృద్ధిపై ఉపాధ్యాయులు దృష్టి సారించాలని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ ఎస్‌డివి రమణ సూచించారు. శుక్రవారం ఆయన మండలంలోని కారివలస, లుంబేషు, తాడికొండ ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలలు, ఒప్పంగి మండల పరిషత్ పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. విద్యార్థుల పురోభివృద్ధిపై దృష్టి సారించి సమయానుకూలంగా ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి పాఠశాలలకు హాజరు కావాలని అన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు ఫేస్‌యాప్‌ను ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి వేసి విద్యార్థుల హాజరును ఆన్లైన్లో నమోదు చేయాలన్నారు. అలాగే విద్యార్థులకు వండి పెట్టే మధ్యాహ్న భోజనాన్ని రుచికరంగా అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఆయన తాడికొండ ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలకు మంజూరైన నాడు-నేడు భవన నిర్మాణ పనులను పరిశీలించి సంబంధిత ఇంజనీరింగ్ సిబ్బందికి తగు సూచనలు చేశారు. అనుకున్న సమయానికి పాఠశాల భవనాన్ని అందించాలన్నారు. భవనాల నిర్మాణంలో ఎటువంటి అక్రమాలకు తావులేకుండా నాణ్యత ప్రమాణాలను పాటించాలన్నారు. అనంతరం స్థానిక జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించి మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి మెరుగైన మెనూ విద్యార్థులకు అందించాలన్నారు. కొత్త మెనూ చార్టులను ప్రతి పాఠశాలలోనూ అంటించాలన్నారు. విద్యార్థులతో కాసేపు పాఠ్యాంశాలపై చర్చించారు. ఆయన వెంట అసిస్టెంట్ ఎఎంఒ సిహెచ్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు శంకరరావు, జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.భీముడు, ఉపాధ్యాయులు ఉన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ వితరణ

కురుపాం : యూత్ ఎంపవర్ మెంట్ సర్వీస్ సొసైటీ డైరెక్టర్ షేక్‌గౌస్ శివన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా విద్యాశాఖ అధికారి డిఎస్‌వి రమణ హాజరై విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులంతా సద్వినియోగం చేసుకొని మెరిట్ స్కాలర్‌షిప్‌ను సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపిపి శెట్టి పద్మావతి, స్థానిక సర్పంచ్ జి.సుజాత, ఉప సర్పంచ్ షేక్‌ఆదిల్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న డిఇఒ రమణ

నేడు రాజ్యాంగ దినోత్సవం

ప్రజాశక్తి కలెక్టరేట్

భారత రాజ్యాంగ దినోత్సవాన్ని శనివారం నిర్వహిస్తున్నట్లు డిఆర్ఒ జె.వెంకటరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజ్యాంగ దినోత్సవం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శనివారం ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొనాలని ఆయన కోరారు.

నేడు వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ రాక

ప్రజాశక్తి - కలెక్టరేట్

రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ ఎం.వి.ఎస్.నాగిరెడ్డి శనివారం జిల్లాకు వస్తున్నారని జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్ పాల్ తెలిపారు. ఈ మేరకు శుక్ర వారం ఒక ప్రకటన విడుదల చేశారు. 26న ఉదయం 9.30 గంటలకు పార్వతీపురం చేరుకుంటారని చెప్పారు. పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అధికారులు, శాస్త్రవేత్తలు, రైతులు, వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల ప్రతినిధులతో జరిగే సమావేశంలో పాల్గొంటారని ఆయన తెలిపారు. మధ్యాహ్నం 2.30 గంటలకు ఉద్యాన కళాశాలను సందర్శిస్తారని ఆయన పేర్కొన్నారు. అనంతరం బయలుదేరి విశాఖపట్నం వెళతారని ఆయన చెప్పారు.


ఆర్‌బికెల ద్వారానే ధాన్యం కొనుగోలు

పౌర సరఫరాలశాఖ కమిషనర్ అరుణ్‌కుమార్

ప్రజాశక్తి- పాలకొండ రూరల్

ధాన్యం కొనుగోలు రైతు భరోసా కేంద్రాల ద్వారానే చేపడుతున్నామని పౌరసరఫరాల శాఖ కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్ తెలిపారు. మండలంలో బెజ్జి రైతు భరోసా కేంద్రాన్ని శుక్రవారం సందర్శించి అక్కడ రైతులతో మాట్లాడారు. రెండేళ్ల నుంచి నేరుగా ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేస్తుందని చెప్పారు. దీనికి రైతులంతా సహకరించాలని కోరారు. ఈ విధానం వల్ల రైతులకు ఎటువంటి ఇబ్బందులు ఉండవన్నారు. ఆర్‌బికెల్లో గోనెసంచిలు, వాహనాలు, కూలీలు అందుబాటులో ఉంచుతున్నట్టు చెప్పారు. వాలంటీర్ల ద్వారా నమూనాలు సేకరించి తేమశాతం గుర్తించి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు అందిస్తామ న్నారు. రైతులే గోనె సంచులు, కూలీలు, రవాణా ఏర్పాటు చేసుకుంటామంటే మద్దతు ధరతో పాటు ఆ ఛార్జీలు కూడా అందిస్తామన్నారు. క్వింటాకు ఒక్కో సంచికి రూ.6.50 అందిస్తామని, అలాగే 50 క్వింటాలకు కూలీలకు రూ.230 చొప్పున అందిస్తామని చెప్పారు. అలాగే మిల్లర్లతో మాట్లాడారు. రైతులు ఇబ్బంది పడితే కఠిన చర్యలు తప్పవన్నారు.

సిసి కెమేరాలు ఏర్పాటు చేయాలని, బ్యాంకు గ్యారెంటీలు ఇవ్వాలన్నారు. దీనిపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్‌ను ఆదేశించారు. ధాన్యం ఇచ్చిన రైతులకు 21 రోజుల్లోనే డబ్బులు ఆయా ఖాతాల్లో జమయ్యేలా చర్యలు తీసుకుంటు న్నామన్నారు. ఆయనతో పాటు సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్, వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ రాబర్ట్‌పాల్, ఎడి రత్నకుమారి, తహశీల్దార్ పి.సోమేశ్వరరావు, ఎఒ వై.వాహిణి ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అరుణ్‌కుమార్



హైడ్రాలిక్ ప్రాజెక్టు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

హైడ్రాలిక్ పవర్ ప్రాజెక్ట్ అనుమతులు రద్దు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - సాలూరురూరల్

మండలంలోని కూరుకుట్టి పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేయనున్న హైడ్రాలిక్ పవర్ ప్రాజెక్టుకు ప్రభుత్వం ఇచ్చే అమతులు రద్దు చేస్తున్నట్టు రాష్ట్ర గిరిజన సంక్షేమ మంత్రి బహిరంగ ప్రకటన చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు డిమాండ్ చేశారు. పవర్ ప్రాజెక్ట్ నిర్మాణ ప్రాంతాన్ని శుక్రవారం ఆయన పరిశీలించి, అక్కడి బాధిత గ్రామాలైన సోంపిగాం, సారిక, కొత్తూరులో పర్యటించి గ్రామస్తులతో మాట్లాడారు. గిరిజనులకు నష్టం చేసే హైడ్రాలిక్ పవర్ ప్రాజెక్ట్ అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ పవర్ ప్రాజెక్ట్ నిర్మాణ వల్ల సుమారు 7 గ్రామాల గిరిజనులు నష్టపోతారని, భూములు కోల్పోయి గ్రామాలు మునిగిపోయి ఖాళీ చేయాల్సి వస్తుందని తెలిపారు. గిరిజన గ్రామ సభలు అనుమతి లేకుండా అడ్డగోలుగా అనుమతులు ఇవ్వడం సరికాదన్నారు. ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని, పవర్ ప్రాజెక్ట్ నిర్మాణ చేయమని గిరిజన శాఖామంత్రి రాజన్నదొర బహిరంగ ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఆంధ్రా- ఒడిషా సరిహద్దు వివాదం ఈ ప్రాంతంలో ఉన్న గంజాయి భద్ర పంచాయతీ ప్రజలకు పూర్తిగా రహదార్లు లేకుండా పోయిందని తెలిపారు. ఈ సమస్యలపై గిరిజన ప్రజలను సమీకరించి పోరాటం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు, గిరిజన సంఘం మండల నాయకులు చింత జోగయ్య, గెమ్మెల తిరుపతి, సూకురు గంగయ్య, మెల్లిక ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

వీధి నాటకాల ద్వారా ఎయిడ్స్‌పై అవగాహన

ప్రజాశక్తి - కలెక్టరేట్

జిల్లాలో హెచ్ఐవి, ఎయిడ్స్‌పై వీధి నాటకాల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నట్టు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ డాక్టర్ బగాది జగన్నాథరావు అన్నారు. జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ శుక్రవారం నుంచి కళాజాత బృందాలతో వీధి నాటకాల ద్వారా హెచ్ఐవి, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించేందుకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు కళా బృందాల ప్రదర్శనలను శుక్ర వారం ప్రారంభించారు. ఎపి థియేటర్స్ సంస్థ, సహృదయ నట సమాఖ్య కళా బృందాలు ముందుగా ఎంపిక చేసిన గ్రామాల్లో నిర్వహిస్తారని ఆయన పేర్కొన్నారు. ఈ కళాజాతలో హెచ్.ఐ.వి/ఎయిడ్స్ ఎలా వస్తుంది, ఎలా వ్యాపించదు, రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, వివక్షత చిన్న చూపు లేకుండా సమాజంలో ఎలా కలసి జీవించాలి, స్వచ్ఛంద రక్తదానం వాటిపై గ్రామీణ, గిరిజన ప్రాంతాల ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని ఆయన వివరించారు.

కళాజాతల పర్యటన వివరాలు


ఈ నెల 26న సాలూరు, భామిని, 28న సాలురు, 29న మక్కువ, 30న గుమ్మలక్ష్మీపురం, మొండెంఖల్లు, డిసెంబరు 1న కురుపాం, నర్సి, 2న సివిని, కొమరాడ, 3న పాలకొండ, సీతంపేట, 6న సీతానగరం, బూర, 7న రావివలస, లక్ష్మీపురం, 8న లక్ష్మీపురం, మాతుమురు, 9న బలిజి పేట, గలావిల్లి, 10న వీరఘట్టంలో ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నట్టు డిఎంహెచ్ఒ తెలిపారు. సంతలు, గ్రామ సచివాలయాలు వంటి జనసమ్మర్ద ప్రదేశాలలో కళాజాతలను ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు డిఎంహెచ్ఒ ధవళ భాస్కరరావు, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి జగన్మోహన్ రావు, డిప్యూటీ, డిఎంహెచ్ఒ వినోద్, డిపిఎం పి.బాలాజీ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ కౌన్సిలర్ కె.కృష్ణ మూర్తి, ఐసిటిసి ఎం.పద్మ, తదితరులు పాల్గొన్నారు.

సొంత పార్టీలోనే వెన్నుపోటు దారులు

- ఇన్‌ఛార్జి పదవి ఇస్తే నాపై ఎందుకంత అసూయ
- టిడిపి కురుపాం నియోజకవర్గ ఇన్‌ఛార్జి జగదీశ్వరి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

సొంత పార్టీలోనే వెన్నుపోటు దారులున్నారని, ఎస్‌టి గిరిజన మహిళకు ఇన్చార్జి పదవి ఇస్తే ఎందుకు ఇంత అసూయంటూ కురుపాం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి కన్నీటి పర్యంతమై భావోద్యానికి లోనయ్యారు. మండలంలోని లోవముతా ప్రాంతమైన దేరువాడలో మాజీ సర్పంచులు, ఎంపిటిసిలు, టిడిపి నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జగదీశ్వరి మాట్లాడుతూ తనకు ఇన్చార్జిగా బాధ్యతలు అప్పజెప్పినప్పటి నుంచి ఇప్పటి వరకు నియోజక వర్గంలో కొంతమంది టిడిపి నాయకులు రెండో వర్గంగా ఏర్పడి తనకు వ్యతిరేకంగా పనిచేస్తున్నారని అన్నారు. పార్టీ అభివృద్ధికి కలిసికట్టుగా పని చేద్దామని ఎన్నోసార్లు పిలిచినా ఎందుకు రాలేదని ప్రశ్నించారు. గ్రూపు రాజకీయాలు చేస్తూ పార్టీని భ్రష్టు పట్టిస్తున్నారని అన్నారు. స్వచ్ఛమైన గిరిజనురాలై ఉన్న తనను గిరిజనురాలు కాదు రాజుల తొత్తు అంటున్నారని అన్నారు. సుదీర్ఘ రాజకీయాలు, ఎంతో విలువైన పదవులు పొందిన వారి సలహాలు తీసుకోవడం తప్పేమిటని ప్రశ్నించారు. బడుగు, బలహీన వర్గాల కుటుంబాలకు చెందిన తనకు శత్రుచర్ల విజయరామరాజు ఈ స్థానం కల్పిస్తే మీకు సహించడం లేదా, మీకు చిత్తశుద్ధితో పార్టీకి సేవ చేస్తున్నారా అంటూ ప్రశ్నించారు. అక్కడున్న ఆశావాహులు ఆనాడు శత్రుచర్ల కాలుపట్టిన రోజులున్నాయన్నారు. ఆశావాహుల్లో ఆరుగురికి ఇస్తే చేస్తాం అనడం ఎక్కడ న్యాయమన్నారు. తానూ గిరిజనురాలిలేనని, మీకు ఎంత హక్కు ఉందో నాకు అంతే హక్కు ఉందన్నారు. ప్రతి గ్రామంలో పార్టీ కార్యక్రమాలు చేస్తుంటే చేయడం లేదని తప్పుడు ప్రకటనలు చేయడం హాస్యస్పదంగా ఉందన్నారు. తాను చేస్తున్న పనులకు ఓర్వలేక ఈ విధమైన కల్లబొల్లి కబుర్లు చెబుతున్నారని మండిపడ్డారు. టిడిపి సీనియర్ నాయకులు కద్రక కళావతి మాట్లాడుతూ చంద్రబాబు, కళా వెంకట్రావు, అచ్చన్నాయుడు ఆశీస్సులతో జగదీశ్వరికి ఇన్చార్జి బాధ్యతలు అప్పగిస్తే విజయరామరాజు దత్తపుత్రిక అనడం ఎంతవరకు సబబు అని అన్నారు. సీనియర్ నాయకులు కె.దాసు మాట్లాడుతూ గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల్లో గ్రూపు రాజకీయాలు చేస్తున్నారని ఇది మంచి పద్ధతి కాదన్నారు. టిడిపి బలోపేతానికి కృషిచేసి జగదీశ్వరిని ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామని అన్నారు. సమావేశంలో టిడిపి నాయకులు కె.జానకి, అడ్డాకుల నరేష్, పువ్వల రమేష్, అని బాబు, కోటి నెల్లికెక్కువ మాజీ సర్పంచ్ సోమేశ్ తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌ఛార్జి జగదీశ్వరి

పొంగ మంచుకాదది.. ధూళే

- ప్రధాన రహదారంతా ధూళి మయం
- ప్రయాణికులు, దుకాణదారులకు అవస్థలు
- అయినా పట్టని అధికారులు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ఈ ఫొటో చేస్తే పట్టణాన్ని పొంగ మంచు కమ్మేసిందని అనుకుంటున్నారేమో.... అలా అనుకుంటే పొరపాటు పడినట్టే... జిల్లా కేంద్రమైన పార్వతీపురంలో ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలు వచ్చిన దుమ్మూ, ధూళి. స్థానిక పాత బస్టాండ్ కూడలి వద్ద అంతర్ రాష్ట్ర రహదారిలో ఏర్పడిన గోతులను కప్పే క్రమంలో ఆర్ అండ్ బి అధికారులు క్రషర్ బుగ్గివేయడంతో ఈ దుమ్మూ, ధూలి. వీటి మధ్య ప్రయాణికులు, దుకాణదారులు, వాహన చోదకులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారిపై నిత్యం వేలాదిగా రాకపోకలు సాగిస్తున్న పాదచారులు, ద్విచక్ర, భారీ వాహన దారులు, పట్టణ ప్రజలు కష్టాలు వర్ణనాతీతం. ఈ దుమ్ము ధూళి కారణంగా చాలామంది శ్వాసకోస వ్యాధులు బారిన పడుతున్నామని పలు సందర్భాల్లో తమ ఆవేదనను వెల్లబుచ్చుకున్న సందర్భాలు అనేకం. అయినా అధికారులుగానీ, ప్రజాప్రతినిధులు గానీ తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా ఆర్ అండ్ బి అధికారులు తక్షణమే స్పందించి ఆ ప్రాంతంలో బి టి రోడ్డును వేసి తమ ఆరోగ్యాలను కాపాడాలని ఆ ప్రాంత వాసులు వేడుకుంటున్నారు.



క్రషర్ బుగ్గితో రేగుతున్న దుమ్మూ, ధూళి

భవన నిర్మాణ పనులు వేగవంతం : పిఒ

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్నెస్ సెంటర్ల భవన నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి బి.నవ్య సిబ్బందిని ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని ఒకటో సచివాలయాన్ని సందర్శించిన సందర్భంగా మాట్లాడారు. జియో టాకింగ్ పూర్తయిందా వాటికి సంబంధించి ఎఫ్‌టిఒ జనరేట్ అయ్యిందా అని ఇంజనీరింగ్ సహాయకులను ప్రశ్నించారు. పనులు ప్రాప్తికి బిల్లులు కూడా సిద్ధం చేయాలని సహాయకులను ఆదేశించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు కూడా చూడాలన్నారు. ప్రతీదీ అప్డేట్ చేయాలని సూచించారు. గ్రామంలో ఫీవర్ సర్వే ఎన్సీడీ సర్వేలపై ఆరా తీశారు. మండల కేంద్రంలోని ప్రధాన రహదారికి సంబంధించి పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె స్పష్టం చేశారు. పైప్‌లైన్లు ఏర్పాటు చేసేందుకు ఐటిడిఎ నిధుల నుంచి రూ:27లక్షలు కేటాయించినట్లు పిఒ తెలిపారు. సకాలంలో విధులకు హాజరు కావాలని, బయోమెట్రిక్ కూడా శతశాతం వేయాలని అన్నారు. పిఒతో పాటు ఎంపిడిఒ ఎ.ప్రభాకరరావు, మేజర్ పంచాయతీ ఎగ్జిక్యూటివ్ అధికారి వి.రామచంద్రరావు, విఆర్‌ఒలు జి.సురేష్‌కుమార్, అప్పలనాయుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న పిఒ నవ్య

సైన్స్ పోటీల్లో బిజె పురం విద్యార్థి రాష్ట్రస్థాయికి ఎంపిక

జియ్యమ్మవలస : సీతానగరంలో గురువారం జరిగిన జిల్లా స్థాయి నేషనల్ చిల్డ్రన్ సైన్స్ కాంగ్రెస్ పోటీల్లో మండలంలోని బిజెపురం జెడ్పి ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థి బడే కేశవ నాయుడు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.జనార్ధననాయుడు తెలిపారు. పాఠశాల సైన్స్ ఉపాధ్యాయిని ఎన్.గౌతమి సహాయ సహకారాలు విద్యార్థికి అందించారన్నారు. పంట వ్యర్థాల నుంచి సేంద్రియ ఎరువుల తయారీ అన్న అంశానికి గానూ కేశవనాయుడు ఎంపికైనట్లు తెలిపారు. ఈ మేరకు డిసెంబర్ 9న గుంటూరులో జరగనున్న రాష్ట్ర పోటీలకు హాజరవుతారని తెలిపారు. రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం పట్ల ప్రధానోపాధ్యాయుడితో పాటు ఉపాధ్యాయులు, విద్యా కమిటీ చైర్మన్, సభ్యులు అభినందనలు తెలిపారు.

పరీక్షిత్‌రాజును కలిసిన ఎమ్మెల్యే

పార్వతీపురం టౌన్: వైసిపి పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షులుగా నియమితులైన శత్రుచర్ల పరీక్షిత్‌రాజును స్థానిక ఎమ్మెల్యే ఎమ్మెల్యే అలజంగి జోగారావు, నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి చినమేరంగిలో ఆయన స్వగృహంలో కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం పరీక్షిత్‌రాజుకు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బలిజిపేట, సీతానగరం, పార్వతీపురం అర్బన్, రూరల్ పార్టీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, నాయకులు ఉన్నారు.


నాటుసారాను ధ్వంసం చేయిస్తున్న ఎస్ఇబి సూపరింటెండెంట్ శైలజారాణి

నాటుసారాపై ఉక్కుపాదం

వీరఘట్టం : అక్రమ సారా వ్యాపారంపై ఉక్కు పాదం మోపాలని ఎస్ఇబి అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ డి.శైలజరాణి సిబ్బందిని ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ ప్రాంతంలో అధికంగా సారా వ్యాపారం జోరుగా సాగుతుందని, వీటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సిబ్బందికి సూచించారు. వచ్చిన సమాచారం మేరకు ఎప్పటికప్పుడు సారా తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించాలన్నారు. అనంతరం వివిధ వ్యక్తుల ద్వారా 570 లీటర్ల పట్టుబడిన నాటు సారాను ధ్వంసం చేశారు. కార్యక్రమంలో పాలకొండ ఎస్ఇబి సిఐ ఎస్.విజయ్ కుమార్, స్థానిక ఎస్సై ఎం.హరికృష్ణ, హెచ్‌సి టి.పోలయ్య, విఆర్ఒ జి.సురేష్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు .

బోరు కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

సీతానగరం : మంచినీటిను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని టిడిపి మండల అధ్యక్షులు కొల్లి తిరుపతిరావు, ఆ గ్రామ పెద్దలు సూర్యనారాయణ, బి,తిరుపతిరావు ఎంపిడిఒ బి.కృష్ణ మహేష్‌రెడ్డికి శుక్రవారం వినతిని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామస్తుల తాగునీటి కోసం మంచినీటి బోరును పంచాయతీ నిధులతో గ్రామంలో తీస్తే ఆ గ్రామానికి చెందిన తాలాపు సింహాచలం అనే వ్యక్తి ఆ బోరుకు విద్యుత్ కనెక్షన్ వేసుకుని తన సొంతానికి వాడుకుంటున్నారని తెలిపారు. తక్షణమే పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు.

ధాన్యం నమూనాలు సేకరణ

సీతానగరం : మండలంలోని బల్లకృష్ణాపురంలో ధాన్యం నమూనాలను మండల వ్యవసాయాధికారులు సేకరించారు. గ్రామాల్లో రైతులు నూర్చిన ధాన్యం వద్దకు టెక్నికల్ అసిస్టెంట్, విఎఎలతో ఎఒ ఎస్.అవినాష్ వెళ్లి ధాన్యం నిల్వల నుంచి నమూనాలు సేకరించారు. ఇందులో ఐదు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా తయారు చేయాలని ఎఒ సూచించారు. శాంపిల్ పరీక్ష జరిగి నాణ్యత బాగుంటే వెంటనే వారికి గోనె సంచులు ఇస్తూ ధాన్యం సిద్ధం చేయమని విఎఎలకు సూచించారు. కార్యక్రమంలో రైతులు, విఎఎలు, టెక్నికల్, డిజిటల్ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

రెల్లి వీధిలో సమస్యలు పరిష్కరించండి

సీతానగరం: మండలంలోని పెదబోగిలి మేజర్ పంచాయితీ పరిధిలో గల రెల్లివీధిలో సమస్యలు పరిష్కరించాలని ఆ వీధి ప్రజలు పి.రాజు, పి.కిరణం, పలువురు మహిళలు పంచాయతీ ఇఒ జి.వెంకట్రావుకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీధిలో ఎక్కడికక్కడే మురుగునీరు నిల్వ ఉంటుందని, కాల్వలు శుభ్రం చేయడం లేదని, నీరు వెళ్లేందుకు కాలువల్లేవని ఆందోళన వ్యక్తం చేశారు. మురుగునీరు నిల్వ ఉండడం వల్ల దోమలు వ్యాప్తితో రోగాలబారినపడుతున్నామని వాపోయారు. తక్షణమే అధికారులు స్పందించి పారిశుధ్య పనులు చేపట్టి దోమలను నివారించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ కె.అరవింద్ కుమార్, కె.కిరణ్, వీధి ప్రజలు పాల్గొన్నారు.


ఇళ్ల ముందే ఉన్న మురుగునీరు

విద్యారంగంలో మార్పులకే శిక్షణ

సీతానగరం : విద్యారంగంలో సరికొత్త మార్పు తీసుకురావడానికి రాష్ట్ర వ్యాప్తంగా లెర్నింగ్ ఇంప్రూవ్మెంట్ ప్రోగ్రాన్ని 6,7,8 తరగతి బోధిస్తున్న ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నట్టు ఎంఇఒ సూరిదేముడు అన్నారు. మక్కువ, సీతానగరం మండలాల్లోని సైన్స్, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులకు లిప్ ట్రైనింగ్ స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహించారు. శిక్షణలో 60మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అడ్డాపుశీలలో డ్రైడే

పార్వతీపురం రూరల్ : మండలంలోని అడ్డాపుశీలలో ఎఎన్ఎం శాంతి, గ్రామ కార్యదర్శి ఎం.కీర్తి ఆధ్వర్యంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా కాలువల్లో పూడిక తీయడం జరిగింది. కార్యక్రమాన్ని జిల్లా సహాయ మలేరియా అధికారి డి.సూర్య నారాయణ, జిల్లా కన్సల్టెంటు జి.రామచంద్రుడు సందర్శించి దోమలు పుట్టకుండా తగు జాగ్రత్తలు పాటించాలని, గృహ పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, వారానికొకరోజు ఫ్రైడే డ్రైడే పాటించాలని ప్రజలకు సూచించారు. నీటి నిల్వలు గల ప్రాంతాల్లో పిచికారీకి తగిన రసాయనిక మందులను ఇస్తామని, నైపుణ్యత గల పనివారితో కాలువల్లో పిచికారీ చేయించడం ద్వారా దోమల పెరుగుదలను అరికట్టి మలేరియా, డెంగీ వంటి వ్యాధుల వ్యాప్తిని అరికట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి, ఆశాలు, సిహెచ్‌డబ్ల్యులు పాల్గొన్నారు.

నగర పంచాయతీలో చైర్‌పర్సన్ పర్యటన

పాలకొండ : పట్టణంలో శుక్రవారం 14వ వార్డుల్లో నగర పంచాయతీ చైర్‌పర్సన్ యందవ రాధాకుమారి పర్యటించారు. అక్కడ ప్రజలతో మాట్లాడి పారిశుధ్య నిర్వహణను అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి ఇబ్బందుల్లేకుండా చూస్తామన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులున్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఆమెతో పాటు 14వ వార్డు కౌన్సిలర్ కడ్రోతు లక్ష్మీ, 17వ వార్డు కౌన్సిలర్ దుప్పాడ పాపినాయుడు, 8, 10, 12 వార్డుల కౌన్సిలర్ ప్రతినిధులు తూముల లక్ష్మణ, కొంచాడ అరుణ్, కోడెం విజయ్‌కుమార్ ఉన్నారు.

సూర్యపీఠంలో అన్న దానం

పార్వతీపురం టౌన్ : పట్టణ శివారును గల శ్రీ సూర్య పీఠంలో మండల దీక్ష పూర్తి చేసుకున్న అయ్యప్ప స్వామి దీక్షాపరులైన భక్తులకు, గురు స్వామి ఆధ్వర్యంలో ఇరుముడి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సుమారు 2వేల మందికి అన్నదాన నిర్వహించారు. అశేషశేముషీనిధి బ్రహ్మశ్రీ వేమకోటి నరహరి శాస్త్రి ఆశీస్సులతో నాగేశ్వర స్వామి, శ్రీనివాస ఇరుముడి కార్యక్రమం నిర్వహించగా, వేమకోటి వివేకానంద్, టి.రామకృష్ణశర్మ వైదిక సహకారం అందించారు. వై. సంతోష్ మండల దీక్ష వనరులు సమకూర్చగా అన్నదానం నిర్వహించారు.


అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నరహరిశాస్త్రి

లింగ వివక్షతను వ్యతిరేకిద్దాం : జెసి

ప్రజాశక్తి - కలెక్టరేట్

లింగ వివక్షను వ్యతిరేకించి సమసమాజాన్ని స్థాపిద్దామని జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్ పిలుపునిచ్చారు. లింగ వివక్ష వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఆర్‌సిఎం నుండి కలెక్టరేట్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని జాయింట్ కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భయం, వివక్ష, హింస లేకుండా గౌరవప్రదమైన జీవితానికి నిర్మాణాత్మక అడ్డంకులను పరిష్కరించడం ద్వారా మహిళలు, లింగ వైవిధ్య వ్యక్తుల హక్కులను, సంస్థలను ముందుకు తీసుకువెళ్లడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ మాసోత్సవాలు డిసెంబరు 23 వరకు కొనసాగుతాయని ఆయన వివరించారు. లింగ వివక్ష అనే ఆలోచన ఉండరాదని ఆడ, మగ అందరూ సమానమనే భావన తీసుకురావాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ఇందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని చెప్పారు. జిల్లాలో ఎక్కడా ఇటువంటి హింస లేకుండా అందరూ ప్రతిజ్ఞ చేయాలని, జిల్లా ఆదర్శవంతంగా ఉండాలని ఆయన కోరారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిలో కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపట్టాలని జెసి సూచించారు. ర్యాలీలో విద్యార్థులు, మహిళలు, ఉద్యోగులు లింగ వివక్ష వ్యతిరేక నినాదాలతో హోరెత్తించారు. కార్యక్రమంలో డిఆర్ఒ జె.వెంకటరావు, డిఆర్‌డిఎ పీడీ పి.కిరణ్‌కుమార్, డిఎంహెచ్ఒ బి.జగన్నాథ రావు, రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం ప్రాజెక్టు అధికారి డా. ధవళ భాస్కరరావు, డిపిఒ బి.సత్యనారాయణ, జిల్లా పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారి డా.ఎంవిఆర్ కృష్ణాజీ, ఐసిడిఎస్ పిఒ కె.విజయగౌ, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి పి.సూర్యనారాయణ, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి లోచర్ల రమేష్, ఐటిడిఎ ఎపిడి వై.సత్యంనాయుడు, జిసిడిఒ రోజా తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం: ఆడపిల్లలపై అత్యాచార్యులు ఆపాలని, లింగ వివక్షతకు ఇక ముగింపు పలకాలని కోరుతూ శుక్రవారం స్థానిక మహిళా సమైక్య ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. మండల మహిళా సమైక్య కార్యాలయం నుంచి ప్రధాన రహదారి మీదుగా అంబేద్కర్ జంక్షన్ వరకూ ప్ల కార్డులు చేత పట్టుకొని బాలికల అక్రమ రవాణా నిలిపివేయాలని, లైంగిక వేధింపులు ఆపాలని, మహిళా చట్టాలను అమలు చేయాలని, మహిళలకు రక్షణ కల్పించాలని తదితర అంశాలపై నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎంపిపి డి.వెంకటరమణ నాయుడు, జెడ్‌పిటిసి జంపు కన్నతల్లి -ఉమామహేశ్వరరావు, ఎంపిడిఒ ఎ.ప్రభాకర్ రావు, ఎపిఎం జి.శివున్నాయుడు, సిసిలు, విఒఎలు పాల్గొన్నారు.

ఐసిడిఎస్ ఆధ్వర్యాన ర్యాలీ

కురుపాం : స్థానిక ఐకెపి కార్యాలయం నుంచి గౌడు వీధి జంక్షన్ వరకు ఐకెపి సిబ్బంది ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులు లింగ వివక్ష తప్పై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిఎం కిషోర్ మాట్లాడుతూ మహిళలపై ఎటువంటి లింగ వివక్షత ఉండకూడదని అన్నారు. కార్యక్రమంలో ఐకెపి సిబ్బంది మహిళలు పాల్గొన్నారు.

పాచిపెంట : వెలుగు మండల సమాఖ్య ఆధ్వర్యంలో లింగ వివక్షకు వ్యతిరేకంగా గ్రామ సంఘాల నేతృత్వంలో ర్యాలీ జరిగింది. కార్యక్రమానికి తొలుత మహిళలతో ర్యాలీ, ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి పి.వీరంనాయుడు (చినబాబు), ఎంపిటిసి సభ్యులు దండి ఏడుకొండలు, ఎపిఎం సత్యనారాయణ, సిసిలు, విఒఎలు, మహిళలు పాల్గొన్నారు.

సీతంపేట : మహిళా మండల మహిళా సమాఖ్య, అంగన్వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో సంత మార్కెట్ నుంచి పార్క్ వరకు ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఎపిఎం రోషిరెడ్డి, ఎపిడి నారాయణరావు, అంగన్వాడీ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.


లింగ వివక్షను అరికడతామంటూ ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు

మహిళలపై హింసను అరికట్టాలి

కలెక్టరేట్: రోజురోజుకూ మహిళలపై పెరుగుతున్న అత్యాచారాలు, హత్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అరికట్టాలని ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి అన్నారు. మహిళలపై హింస వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం వివేకనంద కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి ముగ్గురి మహిళలలో ఒక మహిళ హింసకి గురవుతు ఉందనీ, ప్రతి ఏటా మహిళలపై హింస పెరుగుతున్నా చట్టాలను కట్టుదిట్టంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయడం లేదని అన్నారు. ఆడపిల్లలకు విద్య, ఉద్యోగం, ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. మహిళలకు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా, మగవారితో పాటు సమాన అవకాశాలు కల్పించినప్పుడే అణిచివేత అంతమవుతుందని అన్నారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకులు తులసి, గౌరమ్మ తదితరులు పాల్గొన్నారు.


మహిళలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి శ్రీదేవి


చైర్‌పర్సన్‌కు వినతిని అందజేస్తున్న మున్సిపల్ కార్మికులు

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-పాలకొండ రూరల్

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) పాలకొండ కమిటీ ఆధ్వర్యంలో కార్మికులు నగర పంచాయతీ చైర్ పర్సన్ యందవ రాధాకుమారికి వినతిని శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి దావాల రమణారావు మాట్లాడుతూ జనాభా ప్రాతిపదికన పారిశుధ్య కార్మికుల సిబ్బంది సంఖ్య పెంచాలని, ఇటీవల మరణించిన కుటుంబాలకు తక్షణమే ఉద్యోగాలు ఇవ్వాలని, స్పెషల్ డ్రైవ్‌లో పనిచేసిన పారిశుధ్య కార్మికులు 34మంది వేతన బకాయిలు చెల్లించాలని, కరోనా సమయంలో నియమించిన కార్మికులను కొనసాగించాలని, పనిముట్లు కొత్తవి సరఫరా చేయాలని, కార్మికుల పిఎఫ్ జాబితాను ప్రతినెలా నోటీస్ బోర్డులో ఉంచాలని, ఇఎస్ఐ ప్లానల్ క్లినిక్ పాలకొండలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రెగులర్ కమిషనర్ వచ్చిన వెంటనే సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని ఆమె హామీ ఇచ్చారు. వినతి పత్రం అందించిన వారిలో యూనియన్ అధ్యక్షులు పడాల భాస్కరరావు, కార్యదర్శి చింతల సంజీవ్, ఉపాధ్యక్షులు చింతల సురేష్, కోశాధికారి పడాల వేణు తదితరులు పాల్గొన్నారు.

లైఫ్ సర్టిఫికెట్లు జనవరిలో సమర్పించాలి

ప్రజాశక్తి - సాలూరు

సబ్ ట్రెజరీ పరిధిలోని పించనుదారులు తమ లైఫ్ సర్టిఫికెట్లను జనవరిలో సమర్పించుకోవాలని స్థానిక సబ్ ట్రెజరీ అధికారి వైకె నాయుడు కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గతంలో మాదిరిగా నవంబర్‌లో లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాల్సిన అవసరం లేదని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ తాజా ఆదేశాల మేరకు జనవరి, ఫిబ్రవరి నెలల్లో సమర్పించిన లైఫ్ సర్టిఫికెట్లు మాత్రమే చెల్లుబాటవుతాయని చెప్పారు. ఆన్‌లైన్‌లో గాని, నేరుగా కార్యాలయానికి వచ్చి గాని లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించుకోవచ్చునని తెలిపారు. ఒకవేళ అనారోగ్యంతో బాధపడుతూ కదల్లేని పరిస్థితుల్లో ఉన్న పించనుదారుల ఇళ్ల వద్దకే తాము స్వయంగా వెళ్లి లైఫ్ సర్టిఫికెట్లు స్వీకరిస్తామని చెప్పారు. ఆదాయపన్నుకు సంబంధించిన ధ్రువపత్రాలను డిసెంబర్ 15లోగా సమర్పించాలని ఎస్టిఒ వైకె నాయుడు కోరారు.

విద్యార్థులు బాగా చదువుకోవాలి

ప్రజాశక్తి - సీతంపేట

విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ప్రధాన ఉపాధ్యాయులు పాలక నారాయుడు అన్నారు మండలంలో శుక్రవారం నాయుడు మల్లి ఆశ్రమ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు చదువుకోవడానికి తల్లిదండ్రులు సహకరించాలన్నారు. సెలవులు సమయంలో విద్యార్థులు ఇంటికొస్తే తిరిగి వెంటనే పాఠశాలకు పంపించిన బాధ్యత తల్లిదండ్రులు తీసుకోవాలన్నారు. విద్యార్థులు ఇంటికొచ్చిన సమయంలో కొద్దిసేపైనా విద్యార్థులు చదివేలా తల్లిదండ్రులు చెప్పాలన్నారు. విద్యార్థులకు తల్లిదండ్రులు సహకరించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ వార్డెన్ కామేశ్వరరావు, ఉపాధ్యాయులు కృష్ణారావు, ధర్మారావు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని అబ్బాయిపేట ప్రాథమిక పాఠశాల, సీతానగరం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం పథకం నిర్వహణను ఎంపిడిఒ బి.కృష్ణమహేశ్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యత ప్రమాణంతో కూడిన ఆహారానందించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సక్రంగా అందించాలని, ఎటువంటివి పాల్పడకూడదన్నారు. విద్యార్థుల నుంచి భోజనం పథకం గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కెకె వర్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇ.ప్రసన్నలక్ష్మి, ఉపాధ్యాయులు వి.తవిటినాయుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సత్ప్రవర్తన కలిగి ఉండాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఎల్విన్‌పేట సర్కిల్ పరిధిలోని రౌడీ షీటర్లు ఎలాంటి నేరాలకు పాల్పడకుండా సత్ప్రవర్తన కలిగి ఉండాలని సిఐ సత్యనారాయణ సూచించారు. శుక్రవారం తన కార్యాలయంలో రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. గ్రామాల్లో నాటుసారా తయారీ, విక్రయాలకు పాల్పడొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ షణ్ముఖరావు ఉన్నారు.


సతీష్‌కుమార్‌ను సన్మానిస్తున్న సంఘం నాయకులు, ఉద్యోగులు

ఎపిజిఇఎ డివిజన్ గౌరవ అధ్యక్షులుగా సతీష్ కుమార్

సీతంపేట : ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఎపిజిఇఎ) డివిజనల్ గౌరవ అధ్యక్షులుగా వై. సతీష్‌కుమార్ నియమించబడ్డారు. ఆయన రాష్ట్ర ఐటిడిఎ ఎంటిఎస్ ఎంప్లాయ్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పనిచేయుచున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి నూతులపాటి భరత్ భూషణ్ రాజ్, తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు బి.జగదీష్, బబ్బురు గణేష్ బాబు, కోశాధికారి పి. జయకుమార్, కిషోర్, విస్సు తదితరులు సతీష్‌ను సన్మానించి అభినందనలు తెలిపారు.

పెదగొత్తిలిలో గడపగడపకు

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని పెదగొత్తిలిలో ఎమ్మెల్యే పి.పుష్పశ్రీవాణి గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎంపిటిసి సభ్యులు వి.కృష్ణకుమారి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అందిస్తున్న సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఎంపిపి శెట్టి పద్మావతి, జెడ్‌పిటిసి సభ్యులు జి.సుజాత, ఎఎంసి చైర్మన్ ఎన్.వెంకట్రావు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని ఆర్.వెంకంపేట సచివాలయంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలో అన్ని వీధుల్లో తిరిగి ప్రతి గడపకు వెళ్లి ప్రజలను కలుసుకుని ప్రభుత్వం వారికి అందజేసిన సహాయాన్ని వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు మామిడి బాబ్జీ, మండల పార్టీ అధ్యక్షులు బొంగు చిట్టిరాజు, బి.శ్రీరాములు నాయుడు, సర్పంచ్ పెంట శ్రీదేవి, నాయకులు పెంట శ్రీనివాసరావు, పెంట అప్పారావు, పెంట రామారావు, పోల ఈశ్వర నారాయణ, అంబటి కష్ణం నాయుడు, అర్వి, రత్నాకర్, ఎన్ రామకష్ణ, టి వెంకట అప్పల నాయుడు, పలువురు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

భామిని : మండలంలోని బిల్లుమడలో గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అరకు ఎంపి గొడ్డేటి మాధవి, పాలకొండ ఎమ్మెల్యే వి.కళావతి పాల్గొన్నారు. తొలుత గ్రామంలో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు చెప్పిన సమస్యలు విని పరిష్కారానికి చొరవ తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ తోట సింహాచలం, వైస్ ఎంపిపి బోనగడ్డి ధర్మారావు, జెడ్‌పిటిసి బొడ్డేపల్లి ప్రసాదరావు, సర్పంచ్ సిగడాన రాధాకృష్ణ, ఎంపిటిసి బూస బాలకృష్ణ పాల్గొన్నారు.

చెరకు కాటాను తెరిపించాలి

ప్రజాశక్తి - సీతానగరం

సంకిలి ఫ్యాక్టరీ ద్వారా చెరకు రైతులకు చెరకును కొనుగోలు చేసి చెరకు కాటాను ప్రారంభించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి లక్ష్మి నాయుడు కోరారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక తహశీల్దార్‌కు వినతిని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బూర్జిలో ప్రైవేటు వ్యక్తులు కాటా ఏర్పాటు చేసి కారు చౌకగా రైతుల నుంచి చెరకును కొనుగోలు చేసి సప్లై చేసేందుకు కొంతమంది దళారీలు కోరుకుంటున్నారని దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. చెరకు సప్లై చేసిన రైతులకు సంకిలి సుగర్ ఫ్యాక్టరీ ద్వారా కాటా ఏర్పాటు చేసి చెరకు కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలని కోరారు. వినతిని అందజేసిన వారిలో రైతులు గుణుపూరు సింహాచలం, శివున్నాయుడు, జగదీష్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేత్ర శస్త్ర చికిత్సకు వృద్ధుల ఎంపిక

కురుపాం : కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల సచివాలయ పరిధిలో గల గ్రామాల్లో ఇంత వరకూ నిర్వహించిన వైఎస్ఆర్ అవ్వాతాత కంటి వెలుగు నేత్ర పరీక్షల్లో కేటరాక్ట్ (అంతర కుసుమం) టేరిజియం (కొయ్యకండ) ఉన్న 25మందికి శుక్రవారం పుష్పగిరి కంటి ఆసుపత్రికి తరలిస్తున్నట్లు నేత్ర వైద్య అధికారి డాక్టర్ నగేష్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరందరికీ ఉచిత రవాణా, వసతి, భోజనం, కళ్లజోళ్లు, మందులు సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కంటి వైద్య సహాయకులు రోజా, కళ్యాణి, ఆషాకార్యకర్తలు పాల్గొన్నారు.

శరవేగంగా కిచ్చాడ ఆర్‌బికె పనులు

కురుపాం : మండలంలోని కిచ్చాడ రైతు భరోసా కేంద్ర నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. శుక్రవారం సర్పంచ్ జి.రాజ్యలక్ష్మి, అయ్యరకల కార్పొరేషన్ డైరెక్టర్ జి.విజయచంద్రశేఖరావు శ్లాబ్ పనులను టెంకాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పంచాయతీలో ప్రత్యేకంగా రైతు భరోసా కేంద్రం ఏర్పాటు చేసి ఆ కేంద్రంలో రైతులకు కావాల్సిన సేవలన్నీ అందజేస్తామన్నారు. దీన్ని రైతులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇఒసోమశేఖర్, సచివాలయ సిబ్బంది గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


గిరిజన వర్సిటీ సాలూరులో ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - సాలూరు

కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయాన్ని సాలూరులోనే ఏర్పాటు చేయాలని షెడ్యూల్ ఏరియా ఆదివాసీ సంఘం జిల్లా అధ్యక్షులు నిమ్మక సింహాచలం డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయనతో పాటు పలు గిరిజన సంఘాల నాయకులు నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సిఎం జగన్ మోహన్ రెడ్డి ప్రజాసంకల్ప యాత్రలో సాలూరు వచ్చినప్పుడు గిరిజన యూనివర్సిటీని ఏజెన్సీ ప్రాంతంలో ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. ఇంతవరకు నియోజకవర్గ పరిధిలో ఉన్న మెంటాడ మండలం విజయనగరం జిల్లాలో విలీనమైందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మెంటాడ, దత్తిరాజేరు మండలాల సరిహద్దు ప్రాంతంలో గిరిజన యూనివర్సిటీని ఎలా ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు. సాలూరు, రామభద్రపురం మండలాల పరిధిలో ఉన్న భూములలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుకు పరిశీలించిన కేంద్ర అధికారులు మెంటాడ, దత్తిరాజేరు మండలాల్లో ఏర్పాటుకు ఎలా అంగీకరించారని ప్రశ్నించారు. డిప్యూటీ సిఎం రాజన్నదొర ఈ విషయం లో ఎందుకు మౌనం వహిస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. గిరిజన సంఘాల జెఎసి ఆధ్వర్యాన త్వరలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుపై ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో ఆదివాసీ వికాస్ పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.జయసింహ, మండల అధ్యక్షుడు ఎం.నారాయణరావు, నాయకులు గిరిధర్,రాము పాల్గొన్నారు.

సారా ప్యాకెట్లు స్వాధీనం

ప్రజాశక్తి - పాచిపెంట : మండలంలోని పద్మాపురం జంక్షన్ వద్ద శుక్రవారం అక్రమంగా తరలిస్తున్న 200 నాటు సారా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఎంవి రమణ తెలిపారు. పాచిపెంటకు చెందిన రౌతు శంకర్రావు మోటార్ సైకిల్‌పై 200 సారా ప్యాకెట్లు అక్రమ రవాణా చేస్తుండగా పట్టుకొని, సారా ప్యాకెట్లు, మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లు ఎస్సై తెలిపారు


ఎంపి, ఎమ్మెల్యేకు వినతిని అందజేస్తున్న మండల ప్రజాప్రతినిధులు

సీతంపేటలో జన జాతీయ గౌరవ దివాస్ వేడుకలు

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక పిఎంఆర్‌సి ఇద్ద జన జాతీయ గౌరవ దివాస్ వేడుకలు స్వచ్ఛత కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమంలో అరకు ఎంపి జి.మాధవి, స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి పాల్గొన్నారు. ఈసందర్భంగా వీరికి గ్రామస్తులు పలు సమస్యలపై వినతులు అందజేశారు. రచ్చబండలు, కమ్యూనిటీ హాల్స్ మంజూరు చేయాలన్నారు. బస్ షెల్టర్లు ఏర్పాటు చేయాలని, పంచాయతీకు కొత్త భవనాలు నిర్మించాలని, రక్షిత మంచినీటి పథకాలు మంజూరు చేయాలని కోరారు. అలాగే జీవో 52ను రద్దుచేసి, పిసా చట్టం అమలయ్యే చూడాలన్నారు. స్థానిక ఎపిఆర్ స్కూల్ బాలుర నూతన భవనం ఏర్పాటు చేయాలని కోరారు. అంతకు ముందు పిఎంఆర్‌సి ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కె.గీతాంజలి, ఎపిఒ సాగర్, ఎంపిపి బిడ్డిక ఆదినారాయణ, జెడ్‌పిటిసి ప్రతినిధి సవర రాము, వైస్ ఎంపిపి ప్రతినిధి మూటక రామారావు, ఎఎంసి చైర్మన్ హిమరక మోహనరావు, సర్పంచులు, కళావతి, ఆదిలక్ష్మి, తిరుపతిరావు, ఎంపిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.

ఎస్‌బిఐ వినియోగదారుల సేవా కేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని ఎల్విన్‌పేట పోలీస్ స్టేషన్ సమీపంలో స్టేట్ బ్యాంక్ వినియోగదారుల సేవా కేంద్రాన్ని కేదారిపురం స్టేట్ బ్యాంక్ మేనేజర్ వర ప్రసాద్, సిఐ సత్యనారాయణ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతు ఈ సేవ కేంద్రాన్ని మండల ప్రజలు వినియోగించుకోవాలని, బ్యాంకు సర్వీస్‌లన్నీ ఈ కేంద్రంలో అందుబాటులో వుంటాయని అన్నారు. ఈ కేంద్రంలో అకౌంట్ ఓపెనింగ్, నగదు లావాదేవీలు అన్ని చేసుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ షణ్ముఖరావు ఉన్నారు.

వేలంతో రూ.5.5 లక్షలు ఆదాయం

వీరఘట్టం : స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణంలో శుక్రవారం నిర్వహించిన వేలంపాటలో రూ.5,50,470 ఆదాయం వచ్చినట్లు ఎస్ఇబి పాలకొండ సిఐ ఎస్.విజయ్‌కుమార్ తెలిపారు. ఒక జీపు, నాలుగు ఆటోలు, నాలుగు ద్విచక్ర వాహనాలకు సంబంధించి వేలం పాటవేయుగా రూ.4.4లక్షలు ఆదాయం వచ్చినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఇబి అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ డి.శైలజా రాణి, స్థానిక ఎస్ఐ ఎం.హరికృష్ణ, సిబ్బంది ఉన్నారు .

యువకుడి ఆత్మహత్య

సాలూరు : మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుడు షాన్ భాషా కుమారుడు షేక్ షాజన్(19) శుక్రవారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గాంధీనగర్‌లో ఉంటున్న ఇంటిలో ఆయన ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. గతంలో ఒకసారి ఆత్మహత్యాయత్నం చేసినట్లు బంధువులు చెబుతున్నారు. ఐటిఐ చదువుకున్న షాజన్ త్వరలో ఉద్యోగం కోసం సౌదీ అరేబియా వెళ్లాల్సి వుండగా ఈ అఘాయిత్యానికి పాల్పడడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. దీనిపై టౌన్ సిఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేశారు.

ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు నేత్ర పరీక్షలు

గుమ్మలక్ష్మీపురం : పాఠశాల విద్యార్థి ఆరోగ్య పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా సెప్టెంబర్ నుంచి నవంబర్ వరకు విద్యార్థులకు నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్నట్లు నేత్ర వైద్యాధికారి డాక్టర్ నగేష్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా దుడ్డుఖల్లు ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు నేత్ర పరీక్షలు నిర్వహించి ఒక విద్యార్థికి దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించి కళ్లజోళ్లకు సిఫార్సు చేసినట్లు తెలిపారు. ఇతరత్రా వ్యాధులకు మందులు పంపిణీ చేశారు. విద్యార్థులకు నేత్ర వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నేత్రదానం పై అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త కళావతి ఆరోగ్యవిస్తరణా ధికారి రమణ, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.